క్లుప్తంగా

పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

మరికల్: మండల సమీపంలో ఉన్న గుడిగండ్ల, లింగంపల్లి జిన్నింగ్ మిల్లుల దగర పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని పత్తి రైతులు శ్రీనివాస్, నర్సింములు, రాములు, కమల్ ఆదివారం సంయుక్త ప్రకటనలో కోరారు. ప్రభుత్వం త్వరగా సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో మార్కెట్‌లో వ్యాపారులు నిలువు దోపిడీకి పాలుపడుతున్నారని ఆరోపించారు. తక్కువ ధరకు పత్తి కొనుగోలు చేయడం వల్ల తీవ్రంగా నష్ట పోతున్నామని వాపోయారు. పత్తి రైతుల కష్టాలను దృష్టిలో ఉంచుకొని అధికారులు పత్తి సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల నుంచి పత్తి కొనుగోలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

టపాసులపై దేవతల ఫొటోలు తొలగించాలి

మరికల్: దీపావళి పండుగ సందర్భంగా టపాసులపై దేవతల ఫొటోలను తొలగించాలని విశ్వహిందు పరిషత్, భజరంగ్ దళ్ మండల అధ్యక్షుడు రాంప్రకాశ్ గుప్త, ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్‌రెడ్డి, రవి అన్నారు. సంప్రదాయలకు విరుద్ధంగా లక్ష్మి దేవత ఫొటోలు ఉన్న టపాసులను పేల్చరాదని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అలగే దుకాణాదారులు కూడా దేవతల ఫొటోలు ఉన్న టపాసులను విక్రయించవద్దని సూచించారు. ఇలాంటి టపాసులు తెచ్చిన దుకాణాదారులపై కేసులు నమోదు చేయాలని పోలీసులను కోరారు.

ఎంపీటీసీ సభ్యుల నామినేషన్ కేంద్రాలు ఎంపిక

మరికల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా మండలంలో 11 ఎంపీటీసీ స్థానాలకు గాను నాలుగు నామినేషన్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. మాధవరం, ఎలిగండ్ల ఎంపీటీసీ స్థానాలకు మరికల్‌లోని పంచాయతీరాజ్ డిప్యూటీ కార్యాలయంలో, మరికల్ 1,2,3 ఎంపీటీసీ స్థానాలకు మరికల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో, కన్మనూర్, జిన్నారం, చిత్తనూర్ ఎంపీటీసీ స్థానాలకు కన్మనూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో, పెద్దచింతకుంట, పూసల్‌పహాడ్, తీలేర్ స్థానాలకు తీలేర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో నామినేషన్లు వేయాలని ఎంపీడీఓ కొండన్న తెలిపారు.

క్రీడాకారులకు క్రికెట్ కిట్లు అందజేత



మరికల్: మండల కేంద్రంలోని క్రీడాకారులకు దాత రాజమూరి నవీన్‌కుమార్‌రెడ్డి క్రికెట్ కిట్లను అందజేశారు. ఆదివారం మరికల్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తనవంతు సాయంగా క్రికెట్ కిట్లుతో పాటు నెట్, మ్యాట్‌ను అందజేసినట్లు తెలిపారు. గ్రామ, మండల స్థాయిల్లో జరిగే క్రీడలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకొని క్రీడల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో వాలీబాల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు రాజేష్, యువక మండలి అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, కోచ్ సురేష్, రఘు, మహేష్ పాల్గొన్నారు.

అన్నదమ్ముల గొడవ.. కేసు నమోదు

మాగనూర్: మండల పరిధిలోని కోల్పూర్ గ్రామానికి చెందిన నాకిని అంజప్పపై అతడి తమ్ముడు నాకిని శంకర్ దాడి చేసినట్లు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అశోక్‌బాబు తెలిపారు. ఎస్ తెలిపిన వివరాల మేరకు.. దసరా పండుగా సందర్భంగా శంకర్ తన పిల్లలను తీసుకుని వేరే గ్రామానికి వెళ్తుండగా అతడి మామ అడ్డుగా వచ్చి శంకర్‌ను తిట్టి పిల్లలను తిరిగి ఇంటికి పంపించాడు. ఈ క్రమంలో శంకర్.. అన్న అంజప్ప ఇంటికి వెళ్లి తన మామ సంగతి చూద్దాం తోడుగా రావాలని పిలవగా అందుకు అంజప్ప నిరాకరించాడు. పిలిస్తే రావా అని తాగిన మైకంలో ఇనుప రాడ్డుతో అంజప్ప తలపై కొట్టడంతో అతడికి తీవ్ర గాయలయ్యాయి. చుట్టుపక్కల వారు వచ్చి విడిపించే ప్రయత్నం చేసినా అలానే దాడి చేశాడని అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ముగిసిన మహబూబ్ సుహానీ ఉర్సు

మద్దూరు: మండలంలోని దమ్‌గాన్‌పూర్‌లో వెలసిన మహబూబ్‌సుహానీ ఉర్సు ఆదివారంతో ముగిసింది. శనివారం తెల్లవారు జామున గంధోత్సవం నిర్వహించారు. దమ్‌గాన్‌పూర్, నాగిరెడ్డిపల్లి, ఖాజీపూర్ తదితర గ్రామాల ప్రజలు గ్యార్మిలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం జాతర నిర్వహించారు. జాతర సందర్భంగా పుణే, ముంబాయి, గోవా తదితర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు సైతం వచ్చి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఖాళీ స్థలాలు.. రోగాలకు ఆవాసాలు



ఖాళీ స్థలంలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు



డ్రెయినేజీ లేక ఇళ్ల మధ్య నిలిచిన మురుగు

- ఇళ్ల మధ్యలోనే పిచ్చిమొక్కలు, మురుగు
- కంపుకొడుతున్న కాలనీలు
- పట్టించుకోని అధికారులు

మాగనూర్: మండల కేంద్రంలోని ఆయా కాలనీల్లోని జనావాసాల మధ్యన ఉన్న ఖాళీస్థలాలు రోగాలకు ఆవాసాలుగా మారుతున్నాయి. ఇళ్ల మధ్యన ఉన్న ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు పెరిగి మురుగు నిలవడంతో ఈగలు, దోమలు వృద్ధి చెంది రోగాల వ్యాప్తికి కారణమవుతున్నాయి. అలాగే మురుగుతో కంపు కొడుతుండడంతో ప్రజలు కూడా ఇబ్బందులు పడుతున్నారు. సమస్య పరిష్కారం కోసం స్థానిక పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు. మండలంలోని ప్రధాన రహదారి వెంబడి, సూగురేశ్వర కాలనీ, హౌసింగ్‌బోర్డు కాలనీతో పాటు మరి కొన్ని ప్రదేశాలలో ఖాళీ ప్లాట్లలో ఇళ్ల నుంచి వచ్చే మురుగు నీరు చేరి తీవ్ర దుర్గంధం వస్తుంది. స్థల యజమానులు సైతం ప్లాట్లను శుభ్రంగా ఉంచుకోకపోవడంతో సమస్య తీవ్రమవుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పరిశుభ్రత కోసం చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

డ్రెయినేజీలు లేవు..

గ్రామం విస్తరిస్తుండటంతో ప్రజలు గ్రామ శివారు ప్రాంతాల్లో స్థలాలను కొనుగోలు చేసి ఆవాసాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. అయితే ఆ ప్రాంతాల్లో డ్రెయినేజీలను నిర్మించలేదు. డ్రెయినేజీలు లేపోవడంతో అక్కడ ఇళ్లు నిర్మించుకున్న వారు పక్క స్థలాల్లోకి నీటిని వదులుతున్నారు. దీంతో నీరు బయటకుపోకుండా అక్కడే నిలిచిపోతోంది. ఇక వర్షం వస్తే ఖాళీ స్థలాల్లో వరద చేరి చెరువులను తలపిస్తున్నాయి. దీంతో దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. దీనికి తోడు కొందరు ఇళ్లలోని చెత్తను ,ఇతర వ్యర్థాలను సైతం తీసుకొచ్చి పక్కనే ఉన్న ఖాళీ ప్రదేశాల్లో పడేస్తుండడంతో సమస్య ఉత్పన్నమవుతుంది. పంచాయతీ అధికారులు కూడా తరచూ చెత్తను సేకరించకపోవడం, పారిశుద్ధ్య చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఇబ్బందులు పడుతున్నాం..

మా వార్డులో ఖాళీ ప్లాట్లలో పరిశుభ్రత చర్యలు చేపట్టకపోవడంతో ఇళ్ల మధ్యనే మురుగు నిలిచి పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. ముఖ్యంగా పిచ్చిమొక్కలు , ప్లాస్టిక్, చెత్తచెదారంతో నిండిపోయి ఉండడంతో ఇబ్బందులు తప్పడం లేదు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.

–నర్సింహ, మాగనూర్

విషజ్వరాలు ప్రబలే అవకాశం

ఖాళీ స్థలాల్లో వర్షపు నీరు, మురుగు నిల్వ లేకుండా చూడాలి. మురుగుతో దోమలు పెరిగి విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉంది. అలాగే దుర్వాసన వస్తుండడంతో బయట తిరగలేకపోతున్నాం. అధికారులు ప్లాట్ల యజమానులను పిలిపించి శుభ్రం చేసేలా చర్యలు చేపట్టాలి.

–వెంకటయ్య, మాగనూర్

చర్యలు తీసుకుంటాం..

ప్రస్తుతం సర్పంచ్‌లు లేకపోవడంతో పారిశుద్ధ్య పనుల్లో జాప్యం జరుగుతుంది. స్థానిక ఎన్నికలు పూర్తయిన వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. అదే విధంగా ప్లాట్ల యాజమానులను పిలిపించి వారితో చర్చించి సమస్య పరిష్కరిస్తాం.

–తిమ్మప్ప,
పంచాయతీ కార్యదర్శి, మాగనూర్

కనులపండువగా శ్రీనివాస కల్యాణం



స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకులు

నారాయణపేట: జిల్లా కేంద్రంలోని శ్రీ తీర్థం వెంకటేశ్వర స్వామి దేవాలయం ద్వితీయ వార్షికోత్సవ వేడుకలలో భాగంగా ఆదివారం శ్రీనివాస కళ్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీ శోభన భజన మండలి సభ్యుల ఆధ్వర్యంలో స్వామి వారి భక్తి గీతాలాపన చేశారు. అలాగే హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మేనేజర్ హరీషా చారీ, అర్చకులు కోప్రేష్ చారీ, డాక్టర్ అనిరుధ్ చారీ, రఘుప్రేమ్ తీర్థాచార్యులు, గోపినాథ్, మద్యేశ్ ఆచార్యులు, రవీంద్ర చారీ, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలపై నేడు సన్నాహక సమావేశం

నారాయణపేట: స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి పట్టణంలోని సీవీఆర్ భవన్‌లో సోమవారం నారాయణపేట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశం ఏర్పాటు చేసినట్లు మార్కెట్ చైర్మన్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాంపురం శివారెడ్డి ఆదివారం ఒక ప్రనకటనలో తెలిపారు. మండలంలోని సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీల, వార్డు మెంబర్ల ఆశావాహులు పాల్గొని పేర్లు నమోదు చేసుకోవాల్సిందిగా పేర్కొన్నారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న ఆరు గ్యారెంటీలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ జెడ్పీటీసీలు, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొని వారి గత ఎన్నికల అనుభవాలను పంచుకోవాల్సిందిగా కోరారు.


కార్యకర్తలు సిద్ధంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న బల్‌రాంరెడ్డి

మాగనూర్: మండల పరిధిలోని వర్కూర్ గ్రామంలో ఆదివారం మాగనూర్ బీజేపీ నాయకులు ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి బల్‌రాంరెడ్డి మాట్లాడుతూ పార్టీ బలపరిచిన అభ్యర్థులను ఎన్నికల్లో గెలుపించుకోవాలని, అందుకు తగిన విధంగా కార్యకర్తలు సిద్ధం కావాలని సూచించారు. అదే విధంగా పోటీ చేసే అభ్యర్థుల జాబితాను ఆయా గ్రామాల నాయకులు మండల కమిటీకి ఇవ్వాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు నల్లె నర్సప్ప, నాయకులు జయానంద్‌రెడ్డి, మల్లేష్, కనకరాజు, తిమ్మప్ప, అంజప్పగౌడ, కేశవ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా



ట్రాక్టర్‌లో ఇసుక నింపుతున్న జేసీబీ

మాగనూర్: మండలంలో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. అధికారులు హెచ్చరిస్తున్నా అక్రమంగా ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మండల పరిధిలోని అడవిసత్యావార్ గ్రామంలోని పెద్దవాగు వంతెనపై నుంచి పగలే ఇసుకను రవాణా చేస్తున్నారు. అంతే కాకుండా నంబర్ ప్లేట్స్ లేని వాహనాలతో, డ్రైవింగ్ లైసెన్స్ లేని వారితో ఇసుక ట్రాక్టర్లను నడిపిస్తున్నారు. అధికారులు కూడా చూసీ చూడనట్లుగా వ్యవహరించడంతో యజమానులు ఇష్టానుసారంగా ఇసుకను తరలిస్తున్నారని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి అక్రమ ఇసుక రవాణాను అరికట్టి భూగర్భ జలాలు తగ్గిపోకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మాగనూర్: మండల పరిధిలోని అడవిసత్యావార్ గ్రామ పెద్దవాగు వంతెనపై నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్‌ఐ అశోక్‌బాబు తెలిపారు. అడవిసత్యావార్ వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు తెలియడంతో సిబ్బందితో వెళ్లి దాడి చేసి పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

నేడు బీఆర్‌ఎస్ మండల స్థాయి సమావేశం

నర్వ: నేడు మండల బీఆర్‌ఎస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. సోమవారం మధ్యాహ్నం నిర్వహించే ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మె ల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి హాజరవుతారన్నారు. మండల కేంద్రంలోని అడ్వొకేట్ తిప్పారెడ్డి ఇంటి వద్ద ఈ సమావేశం ఉంటుందని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

కాపుల ఐక్యతకు కృషి చేద్దాం

నర్వ: మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న మున్నూరు కాపుల ఐక్యత కోసం అందరం కృషి చేద్దామని మున్నూరుకాపు సంఘం మండల అధ్యక్షుడు పోతిరెడ్డి హన్మంతురెడ్డి అన్నారు. ఆదివారం సీపూర్ గ్రామంలో నిర్వహించిన నూతన కమిటీ ఎన్నిక కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాబోవు ఎన్నికల్లో మున్నూరు కాపుల గెలుపు కోసం కలిసి కట్టుగా కృషి చేయాలన్నారు. అనంతరం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా సందుల సుదర్శన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఆకుల శ్రీను, గౌరవ అధ్యక్షుడిగా రాంరెడ్డి, ఉపాధ్యక్షుడిగా సుధాకర్, శివారెడ్డి, సహాయ కార్యదర్శిగా అశోక్‌రెడ్డి, జగన్, డీలర్ నర్సిరెడ్డి, కోశాధికారిగా శివ, తదితరులను ఎన్నుకున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

దామరగిద్ద: మండలంలోని బాపన్‌పల్లి గ్రామానికి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్‌లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజు తెలిపారు. నారాయణపేట మండలం పేరపళ్ల గ్రామానికి చెందిన వెంకటప్ప, అనంతయ్య ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తుండగా తనిఖీల్లో పట్టుబడినట్లు తెలిపారు. ట్రాక్టర్‌లను సీజ్ చేసి యజమానులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

కోస్గి రూరల్: పట్టణంలో స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని ఎన్నికల కమిషన్ నిబంధనలను పాటించకుంటే చర్యలు తప్పవని ఎస్‌ఐ బాల్‌రాజ్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఒక వ్యక్తి రాజకీయ పార్టీ పైన, కులమతాల పైనా దుష్ప్రచారం, రెచ్చగొట్టె ప్రసంగాలు చేయకూడదన్నారు. సోషల్ మీడియా వేదికగా అసత్య కథనాలు పోస్ట్ చేస్తే కేసు నమోదు చేస్తామన్నారు.అలాగే వాట్సప్ గ్రూపుల ద్వారా వ్యక్తులను టార్గెట్ చేస్తూ సందేశాలు పంపితే గ్రూపు అడ్మిన్‌తో పాటు పంపిన వ్యక్తిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇతర ప్రాంతాలకు ప్రయాణించే సమయంలో వెంట రూ. 50వేలకు మించి నగదు ఉంటే నగదుకు సంబంధించిన పత్రాలు చూపాలని లేకపోతే నగదును సీజ్ చేస్తామన్నారు.

టెట్‌పై గందరగోళం తొలగించాలి



మాట్లాడుతున్న టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: టెట్‌పై ఉపాధ్యాయుల్లో నెలకొన్న గందరగోళాన్ని తొలగించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ టెట్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రివ్యూ పిటిషన్ వేయాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్‌సీ, రావాల్సిన డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. సమగ్ర ఆరోగ్య విధానం రూపొందించి, హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు. ఉపాధ్యాయులకు పెండింగ్ బిల్లులను త్వరగా చెల్లించాలన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శులు సింహాచలం, ఎం.వెంకటప్ప, జిల్లా అధ్యక్షుడు కె.రవికుమార్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ పాల్గొన్నారు.

ఆదమరిస్తే... అంతే



మండలంలోని సింగారం గ్రామం నుంచి ప్రధాన రహదారి చౌరస్తా వరకు వెళ్లే రోడ్డు మధ్యలో ఉన్న కల్వర్టు దగ్గర మట్టి కుంగిపోవడంతో ప్రమాదకరంగా గొయ్యి ఏర్పడింది. వాహనదారులు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉండడంతో గ్రామానికి చెందిన యువకులు గొయ్యి ఉన్న ప్రాంతంలో రాళ్లు, కట్టెలను ఉంచి సూచిక మాదిరిగా ఏర్పాటు చేశారు. అయితే రాత్రి వేళల్లో ప్రమాదం పొంచి ఉందని సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేసి ప్రమాదాలు జరగకుండా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– నారాయణపేట రూరల్

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం



గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సంస్థ సభ్యులు

దామరగిద్ద: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు సహకరించాలని విజన్ సంస్థ కోఆర్డినేటర్ స్వప్న, శైలజ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని సంజీవరాయ ఆలయ ఆవరణలో బాల్యవివాహాల నివారణ పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించి అనంతరం మాట్లాడారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించి మండలాన్ని బాల్యవివాహాల రహితంగా మార్చాలని కోరారు. ఎక్కడైనా బాల్య వివాహం చేస్తే 1098 ద్వారా లేదా 100కు డయల్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌ఎంపీ వైద్యుడు వెంకట్రాములు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

దేవరకద్ర: కౌకుంట్ల మండల కేంద్రంలో జర్నలిస్టు యాకుబ్ తల్లి ఇటీవల మరణించడంతో ఆదివారం ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి బాధితులను పరామర్శించారు. అనంతరం దేవరకద్రలోని కుర్వగాని శ్రీను తల్లి దశదిన కర్మ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. పలు కార్యక్రమాలకు ఎమ్మెల్యే హాజరయ్యారు. ఎమ్మెల్యే వెంట టీపీసీసీ కార్యదర్శి అరవింద్‌కుమార్‌రెడ్డి, దేవరకద్ర, కౌకుంట్ల మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు అంజిల్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ లక్ష్మీకాంత్‌రెడ్డి, నాయకులు కిషన్ రావు, వెంకటేశ్, రాంపాండు పాల్గొన్నారు.

గ్రూప్-1కు ఎంపికైన యువకుడికి సన్మానం



దేవరకద్ర: ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన గ్రూప్–1లో విజయం సాధించి మున్సిపల్ కమిషనర్ ఉద్యోగానికి ఎంపికైన దేవరకద్రకు చెందిన పడమటి వెంకటేశ్వర్‌రెడ్డిని తోటి స్నేహితులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఆయన నివాసానికి వెళ్లిన శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఇంకా ఉన్నత స్థానానికి చేరుకోవాలని స్నేహితులు కోరారు.

బోరు నుంచి ఉబికి వస్తున్న నీరు



కొత్తపల్లి: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలో భూగర్భ జలం ఉబికి వస్తుంది. నిడ్జింత తండాకు చెందిన శంకర్ నాయక్ తన కున్న రెండు ఎకరాల పొలంలో గతేడాది నాలుగు బోర్లు వేయించాడు. అందులో ఒక బోరులో పుష్కలంగా నీరు రాగా రెండు బోర్లను పూడ్చి వేసి ఒక బోరును 350 ఫీట్ల వరకు తోడి కేసింగ్ వేసి అలాగే వదిలేశాడు. అయితే భారీ వర్షాల నేపథ్యంలో వదిలేసిన బోరు కేసింగ్‌లో నుంచి నీరు ఉబికి వస్తుంది. కేసింగ్‌లో నుంచి నీళ్లు వస్తుండటంతో సమీప గ్రామాల ప్రజలు వచ్చి చూసి వెళ్తున్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

దేవరకద్ర: స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పని చేయాలని మహబూబ్‌నగర్ పార్లమెంట్ బీజేపీ కన్వీనర్ డోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన మాటాడుతూ అన్ని స్థానాలలో కనీసం 50 శాతం పైగా ఓట్లు వచ్చే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించి బీజేపీ గెలుపునకు కృషి చేయాలన్నారు.

రైతన్న కష్టం.. నీటి పాలు



సూకూర్‌లింగంపల్లిలో నీట మునిగిన పంట పొలాలు (ఫైల్)

- నీట మునిగిన వరి పంట
- ఆదుకోవాలంటున్న అన్నదాతలు

కృష్ణా: ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని కృష్ణా, బీమ నదులు ఒక్కసారిగా ఉప్పొంగడంతో నది పరివాహక ప్రాంత ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ప్రధానంగా వరి పంటకు తీవ్ర నష్టం వాటిల్లడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆరుగాలం కష్టించి పండిన పంట నీట మునగడంతో దిక్కుతోచని పరిస్థితిలో సాయం కోసం ఎదురుచూస్తున్నారు.

1259 ఎకరాల్లో నీట మునిగిన పంట

ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు వరద ప్రవాహం పెరగడంతో నది తీర ప్రాంతాలు దెబ్బతినడంతో పాటు అత్యధికంగా వ్యవసాయ పొలాలకు నష్టం వాటిల్లింది. దాదాపు 1259 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లిందని వ్యవసాయ శాఖ అధికారుల చెబుతున్నారు. అలాగే 50 ఎకరాల్లో పత్తి, కంది, ఆముదం పంటలు పాక్షికంగా దెబ్బతిన్నట్లు పేర్కొంటున్నారు. నీట మునిగిన పొలాలను మంత్రి వాకిటి శ్రీహరి సందర్శించి నష్ట పరిహారం అందిస్తామనడంతో రైతులు కొంత ఉపశమనం పొందారు. అయితే పరిహారం అందాలంటే స్థానిక ఎన్నికలు అడ్డుగా మారాయి. ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఉండడంతో ఏలాంటి పరిహారం ఇవ్వడం కుదరదు. దీంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఎన్నికలపై త్వరలోనే హైకోర్టు తీర్పు ఇవ్వనుండగా ఒకవేళ మరింత ఆలస్యం అయితే తమ పరిస్థితి ఏంటని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల నియమావళి నుంచి రైతులకు మినహాయింపు ఇవ్వాలని కోరుతున్నారు.

బాధితులకు నష్టపరిహారం చెల్లించాలి

వరద బాధితులకు ప్రభుత్వం న్యాయం చేయాలి. 2009, 2019లోనూ ఇదే విధంగా తమ గ్రామం ముంపునకు గురైంది. ఇప్పుడు కూడ అదే మాదిరి పంటలు దెబ్బతిన్నాయి. పంట నష్టం విలువను అంచన వేసి బాధితులందరికీ నష్టపరిహారం చెల్లించాలి.

–అంజనేయులు, సూకూర్‌లింగంపల్లి

నివేదిక పంపించాం

మండలంలో అకాల వర్షాలకు, వరదల మూలంగా నీట మునిగిన పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి నివేదిక తయారు చేశాం . దాదాపు 13 వందల ఎకరాల్లో పంట దెబ్బ తింది. ఇందుకు సంబంధించిన నివేదికను అధికారులకు పంపించాం. నష్టపరిహారంపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

–సుదర్శన్‌గౌడ్,
మండల వ్యవసాయ అధికారి



వరదలతో దెబ్బతిన్న వరి పంట